# ఉద్యమాల గడ్డ గులాబీ అడ్డా



దుబ్బాకలో నియోజకవర్గ పార్టీ శ్రేణుల సమావేశంలో మాట్లాడుతున్న మెదక్ ఎంపీ కొత్త ప్రభాకర్‌రెడ్డి




నియోజకవర్గస్థాయి సమావేశానికి హాజరైన కార్యకర్తలు, ప్రజాప్రతినిధులు, బూత్ ఇన్‌చార్జిలు

- దుబ్బాకలో ఎగిరేది 'గులాబీ' జెండానే
- అభివృద్ధి నాది.. ఎన్నికలో మెజార్టీ మీది
- బీజేపీ అధర్మంపై.. బీఆర్‌ఎస్ యుద్ధం
- బీఆర్‌ఎస్‌కు బలం.. బలగం పార్టీ శ్రేణులే..
- హ్యాట్రిక్ సీఎంగా కేసీఆర్‌ను చేసుకుందాం
- బీఆర్‌ఎస్ దుబ్బాక అభ్యర్థి కొత్త ప్రభాకర్‌రెడ్డి
- దుబ్బాకలో బీఆర్‌ఎస్ నియోజకవర్గ స్థాయి సమావేశం

దుబ్బాక, అక్టోబర్ 25 : ఉద్యమాల గడ్డ దుబ్బాకలో ఎగిరేది గులాబీ జెండానే అని బీఆర్‌ఎస్ దుబ్బాక అభ్యర్థి, మెదక్ ఎంపీ కొత్త ప్రభాకర్‌రెడ్డి అన్నారు. తెలంగాణ ఉద్యమంలో ఎందరో ఉద్యమకారులు త్యాగాలు చేశారని, పోలీసు కేసులు, జైలు జీవితాలను అనుభవించారని గుర్తు చేశారు. సీఎం కేసీఆర్‌కు దుబ్బాక అంటే ఎనలేని మమకారమన్నారు. బీఆర్‌ఎస్‌కు కార్యకర్తలే బలం, బలగమన్నారు. బుధవారం దుబ్బాక పట్టణంలోని రజినీకాంత్‌రెడ్డి ఫంక్షన్‌హాల్‌లో బీఆర్‌ఎస్ దుబ్బాక నియోజకవర్గ ప్రజాప్రతినిధులు, ముఖ్య నాయకులు, బూత్ కమిటీ ఇన్‌చార్జిలతో ప్రత్యేక సమావేశం ఏర్పాటు చేశారు. పార్టీ శ్రేణులకు ఎన్నికల్లో అనుసరించాల్సిన విధివిధానాలపై దిశానిర్దేశం చేశారు. సందర్భంగా ఆయన మాట్లాడుతూ దుబ్బాకపై ఉన్న మమకారంతోనే సీఎం కేసీఆర్ ఈ ప్రాంత బిడ్డనైనా తనను ఆశీర్వదించి అభ్యర్థిగా పంపించారని, ఈ ఎన్నికల్లో భారీ మెజార్టీ అందించి సీఎంకు కానుకగా ఇద్దామని పార్టీ శ్రేణులకు పిలుపునిచ్చారు. తెలంగాణ తెచ్చిన కేసీఆర్ సారును రెండుసార్లు సీఎంగా ఎన్నుకున్నామని, ముచ్చటగా మూడోసారి బీఆర్‌ఎస్‌ను భారీ మెజార్టీతో గెలిపించుకుని హ్యాట్రిక్ సీఎంగా కేసీఆర్‌ను చేసుకుందామని పిలుపునిచ్చారు. హనుమంతుడి లేని ఊరైనా ఉండొచ్చు కానీ కేసీఆర్ సంక్షేమ పథకం అందుకోని ఇల్లు లేదని స్పష్టం చేశారు. బీఆర్‌ఎస్ మ్యానిఫెస్టోను ప్రజలకు క్షుణ్ణంగా వివరించాలని సూచించారు. వంద మంది ఓటర్లకు ఒక ఇన్‌చార్జిగా ఉంటూ పార్టీ నాయకులు ప్రజలతో నిత్యం మమేకం కావాలని సూచించారు. పదవుల కోసం ఆరాటపడుతున్న బీజేపీ, కాంగ్రెస్‌కు చరమగీతం పాడాలని ఆయన కోరారు.

**దుబ్బాక అభివృద్ధి నాది.. ఈ ఎన్నికలో మెజార్టీ మీది**

దుబ్బాక అభివృద్ధి పూర్తిగా నాదేనని, ఈ ఎన్నికల్లో మెజార్టీ మీదేనని మెదక్ ఎంపీ కొత్త ప్రభాకర్‌రెడ్డి అన్నారు. ప్రతిపక్షాలు తప్పుడు ప్రచారం చేస్తున్నాయని, వాటిని నమ్మొద్దన్నారు. సిద్దిపేట, గజ్వేల్ నియోజకవర్గాలతో సమానంగా దుబ్బాకను అన్నిరంగాల్లో అభివృద్ధి చేస్తానని హామీ ఇచ్చారు. తనను రెండుసార్లు ఎంపీగా గెలిపించి పార్లమెంట్‌కు పంపించారని, ఇప్పుడు అదే అభిమానంతో భారీ మెజార్టీ అందించి అసెంబ్లీకి పంపించాలని కోరారు.



దుబ్బాక టౌన్ : దుబ్బాకలో జరిగిన నియోజకవర్గ స్థాయి బీఆర్‌ఎస్ సమావేశంలో మెదక్ ఎంపీ కొత్త ప్రభాకర్‌రెడ్డి సమక్షంలో బీఆర్‌ఎస్‌లో చేరిన బీజేపీ, కాంగ్రెస్ పార్టీల కార్యకర్తలు

**బీజేపీ అవలంబిస్తున్న అధర్మం, అవాస్తవాలపై బీఆర్‌ఎస్ చేస్తున్న యుద్ధం**

ఈ ఎన్నికలు బీజేపీ ఎమ్మెల్యే రఘునందన్ అవలంబించిన అధర్మం, అవాస్తవాలపై బీఆర్‌ఎస్ చేస్తున్న యుద్ధమని ఎంపీ కొత్త ప్రభాకర్‌రెడ్డి ప్రకటించారు. గత ఉపఎన్నికల్లో నోటికొచ్చిన హామీలిచ్చి దుబ్బాక ప్రజలను మోసం చేశాడని మండిపడ్డారు. ఇచ్చిన హామీలు నెరవేర్చని అసమర్థ ఎమ్మెల్యేగా రఘునందన్ చరిత్రలో నిలిచిపోయాడని ఎద్దేవా చేశారు. కేంద్రం నుంచి నిధులు తీసుకొచ్చి దుబ్బాకను అభివృద్ధి చేస్తామని దొంగ హామీలు, అవాస్తవాలు చెప్పి, మేనిఫెస్టోలో తప్పుడు హామీలిచ్చి దుబ్బాక ప్రజలను మోసగించాడని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఉసరవెల్లి రాజకీయాలు చేస్తున్న రఘునందన్‌కు ఈ ఎన్నికల్లో ఓటుతో గుణపాఠం చెప్పాలని ప్రజలకు పిలుపినిచ్చారు.

## సంక్షేమ పథకాలపై విస్తృతంగా ప్రచారం జరుగాలి

**దుబ్బాక నియోజకవర్గ బీఆర్‌ఎస్ ఇన్‌చార్జి గ్యాదరి బాలమల్లు**



దుబ్బాక నియోజకవర్గంలో ప్రభుత్వ పథకాలపై విస్తృతంగా ప్రచారం నిర్వహించాల్సిన బాధ్యత నాయకులు, కార్యకర్తలపై ఉందని ఇన్‌చార్జి గ్యాదరి బాలమల్లు అన్నారు. గత ఉపఎన్నికల్లో దుబ్బాకలో బీజేపీది గెలుపు కాదని, ఈ ఎన్నికల్లో పార్టీ శ్రేణులంతా ఐక్యమత్యంతో పనిచేసి, భారీమెజార్టీతో కొత్త ప్రభాకర్‌రెడ్డిని గెలిపించాలని పిలుపునిచ్చారు. దేశంలో బీజేపీ గ్రాఫ్ పడిపోయిందన్నారు. కేవలం మోసపూరిత మాటలతో కాలం వెల్లదీస్తున్నారని ఎద్దేవా చేశారు. నియోజకవర్గంలోని ప్రతి మండలం, గ్రామంలో బీఆర్‌ఎస్ కార్యకర్తలు సైనికులా పనిచేయాలన్నారు. రాష్ట్రంలో మూ డోసారి కేసీఆర్ ముఖ్యమంత్రి కావడమే లక్ష్యంగా పనిచేయాలని పిలుపునిచ్చారు. ఉద్యమాల గడ్డ దుబ్బాకలో మరోసారి గులాబీ జెండా ఎగరడం ఖాయమన్నారు.

## కొత్త జోష్ నింపిన సమావేశం

దుబ్బాక టౌన్, అక్టోబర్ 25 : దుబ్బాకలో బుధవారం జరిగిన నియోజకవర్గ స్థాయి ప్రజాప్రతినిధులు, కార్యకర్తలు, బూత్ ఇన్‌చార్జిల సమావేశం పార్టీ శ్రేణుల్లో కొత్త ఉత్సాహాన్ని నింపింది. సమావేశానికి నియోజకవర్గంలోని అన్ని మండలాల నుంచి పార్టీ శ్రేణులు పెద్దఎత్తున తరలివచ్చారు. వేలాది మంది పార్టీ శ్రేణులతో సమావేశం జరిగిన కోమటిరెడ్డి రజనీకాంత్‌రెడ్డి పంక్షన్ హాల్ గులాబీమయంగా మారింది. అభ్యర్థి కొత్త ప్రభాకర్‌రెడ్డి గెలుపు కోసం తామంతా కంకణబద్ధులమై పని చేస్తామంటూ నాయకులు, కార్యకర్తలు, ప్రజాప్రతినిధులు ముక్తకంఠంతో నినదించారు. ఓటర్లను ఆకర్షించేందుకు చేపట్టాల్సిన చర్యలపై ప్రముఖ వక్త గంప నాగేశ్వర్‌రావు పార్టీ శ్రేణులకు దిశానిర్దేశం చేశారు. రాయపోల్, దౌల్తాబాద్‌తో పాటు పలు మండలాలకు చెందిన బీజేపీ, కాంగ్రెస్ కార్యకర్తలు, నాయకులు ఎంపీ సమక్షంలో బీఆర్‌ఎస్‌లో చేరారు.

# బీఆర్‌ఎస్ హయాంలోనే అభివృద్ధి

- ప్రతిపక్షాలకు అధికార దాహం
- కాంగ్రెస్‌కు ఒక్క చాన్స్ ఎందుకు ఇవ్వాలి...?
- ఎన్నికల తర్వాత గౌరవెల్లి ప్రాజెక్టును ప్రారంభిస్తాం
- బీఆర్‌ఎస్ అభ్యర్థి, ఎమ్మెల్యే వొడితెల సతీశ్‌కుమార్

అక్కన్నపేట, అక్టోబర్ 25 : 60 ఏండ్లలో ప్రతిపక్షాలు చేయని అభివృద్ధిని, సీఎం కేసీఆర్ తొమ్మిదేండ్లలో రాష్ట్రాన్ని అన్నిరంగాల్లో అభివృద్ధి చేసి, దేశానికే తలమానికంగా నిలిపారని బీఆర్‌ఎస్ హుస్నాబాద్ అభ్యర్థి, ఎమ్మెల్యే వొడితెల సతీశ్‌కుమార్ అన్నారు. బుధవారం మండలంలోని గండిపల్లి, పంచరాయితండా, అంబతండా, డాక్యతండా, సరిరాం తండా, రామవరం, బంగారులోదితండా, చౌటకుంటతండా, కుందనివానిపల్లి, మబ్బుకుంట, మైసమ్మవాగుతండా, బొడిగపల్లి, గౌరవెల్లి, కెప్టెన్ కాలనీ, జనగామ గ్రామాల్లో ఎన్నికల ప్రచారంలో ఆయన మాట్లాడారు. ప్రతిపక్షాలు అధికార దాహంతో ఉన్నాయని, ఎన్నికలప్పుడే ప్రజలు గుర్తు వస్తారన్నారు. కాంగ్రెస్‌కు ఒక్క చాన్స్ ఎందుకు ఇవ్వాలని ప్రశ్నించారు. దేశ స్వాతంత్ర్యంలో 50 ఏండ్లు ప్రభుత్వాన్ని నడిపిన కాంగ్రెస్ ప్రజల శ్రేయస్సు, సంక్షేమాన్ని విస్మరించి, అన్నింటిలో స్కామ్‌లకు తెరలేపుతూ కాలం వెల్లదీశారన్నారు. ఇప్పుడు మరోసారి ప్రజలను మోసం చేసేందుకు ఒక్క చాన్స్ అంటూ అడగడం విడ్డూరంగా ఉందన్నారు. కేంద్రంలో ఉన్న బీజేపీ సర్కారు కరీంనగర్ పార్లమెంట్ పరిధిలో ఉన్న హుస్నాబాద్ నియోజకవర్గ అభివృద్ధి కోసం ఎన్ని వేల కోట్లు నిధులు కేటాయించిందో చెప్పాలని డిమాండ్ చేశారు. గౌరవెల్లి ప్రాజెక్టు ద్వారా లక్ష ఆరువేల ఎకరాలకే సాగునీరు అందుతున్నదన్నారు. దశాబ్దాల నాటి ఈ ప్రాంత ప్రజల ప్రాజెక్టు కలను ప్రతిపక్షాలు ఆగం చేశాయన్నారు. ప్రాజెక్టు ప్రారంభిస్తే ఓట్లు పడవని, రాజకీయ కుట్రతో తుది దశలో ఉన్న ప్రాజెక్ట్‌పై కేసులు, ప్రారంభోత్సవాన్ని అడ్డుకున్నారని ఆరోపించారు. ఎన్నికల తర్వాత సీఎం కేసీఆర్ చేతుల మీదుగా ప్రాజెక్టును ప్రారంభిస్తామన్నారు. ఎన్నికల్లో ప్రతిపక్షాలకు ఓటు ద్వారా గుణపాఠం చెప్పి, డిపాజిట్లు గల్లంతు అయ్యేలా చేయాలని పిలుపునిచ్చారు. కార్యక్రమాల్లో బీఆర్‌ఎస్ మండలాధ్యక్షుడు పెసరు సాంబరాజు, ఎంపీపీ మాలోత్ లక్ష్మీ బీలూనాయక్, జడ్పీటీసీ భూక్యా మంగ, మండల ఇన్‌చార్జిలు మ్యాక నారాయణ, కాసర్ల అశోక్ బాబు, లింగాల సాయన్న, మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ తిరుపతిరెడ్డి, మాజీ జడ్పీటీసీ మాలోత్ బీలూనాయక్, రామచంద్రం, రైతుబంధు సమితి మండల అధ్యక్షుడు కందుల రాంరెడ్డి, సర్పంచులు, ఎంపీటీసీలు, పార్టీ గ్రామశాఖ అధ్యక్షులు, ముఖ్యనాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.



రామవరంలో ఎన్నికల ప్రచారంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే సతీశ్‌కుమార్



అక్కన్నపేట: ఎన్నికల ప్రచారానికి తరలివచ్చిన ప్రజలు